క్లుప్తంగా

పోక్సో చట్టంపై అవగాహన



చట్టంపై అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ మల్లికార్జునరెడ్డి

కోవెలకుంట్ల: పట్టణంలోని సనా డిగ్రీ కళాశాలలో బుధవారం విద్యార్థులకు పోక్సో చట్టంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎస్ఐ మల్లికార్జునరెడ్డి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శి ఓబులేసు మాట్లాడుతూ బాలికల మాన, ప్రాణ రక్షణకు ఈ చట్టం అమలవుతోందన్నారు. బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు తిరుపేలు, జాయింట్ సెక్రటరీ శేఖర్, కోశాధికారి నాగేషు, సీనియర్ న్యాయవాదులు జీఎల్ నరసింహుడు, సుధాకర్, కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

షార్ట్‌సర్క్యూట్‌తో దుకాణం దగ్ధం

బేతంచెర్ల: పట్టణ సమీపంలోని నంద్యాల రహదారిలో సెయింట్‌ఆన్స్ స్కూల్ ఎదురుగా ఉన్న టీ, కూల్‌డ్రింక్స్ దుకాణం విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో దగ్ధమైంది. వివరాలు.. పట్టణంలోని సబ్‌రిజిష్టర్ కాలనీ సమీపంలో నివాసం ఉంటున్న నాగరాజు భార్య లక్ష్మి టీ, కూల్ డ్రింక్స్ దుకాణం నిర్వహిస్తూ జీవనం సాగిస్తోంది. మంగళవారం రాత్రి ఇంటికి వెళ్లిన తరువాత దుకాణంలో మంటలు వస్తున్నాయని తెలపడంతో వచ్చి చూడగా మంటలు ఎక్కువై ఆర్పేందుకు ప్రయత్నించినా అదుపులోకి రాలేదు . అప్పటికే దుకాణంలో ఉన్న 2 ఫ్రిడ్జ్‌లు, కూల్ డ్రింక్స్, స్నాక్స్, షోకేజ్‌లు ఆహుతై రూ. 2లక్షల మేర ఆస్తినష్టం జరిగినట్లు ఆమె ఆవేదన వ్యక్తం చేసింది.

ప్రత్యేక పూజలు

డోన్: బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్థానిక వేంకటేశ్వర ఆలయంలో బుధవారం యాగశాలలో భక్తులు అగ్ని ప్రతిష్ట, గరుడ హోమం నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు శ్రీకాంత్ శర్మ, రాముశర్మ ఆధ్వర్యంలో ధ్వజ స్తంభానికి పంచామృతాభిషేకం నిర్వహించి ధ్వజారోహణ కార్యక్రమం చేపట్టారు. ఆలయ ప్రధాన ధర్మకర్తలు పాతాళం సుబ్బారావు, రజనీకుమారి, శ్రీనివాసరావు ఆధ్వర్యంలో భక్తులకు అన్నదాన, ప్రసాద వితరణ జరిగింది.

రేషనలైజేషన్‌తో పని భారం

అవుకు: ప్రభుత్వం గ్రామ, వార్డు సచివాలయాలను రేషనలైజేషన్ చేయడంతో గ్రామ వ్యవసాయ సహాయకులపై పనిభారం పెరుగుతుందని నంద్యాల జిల్లా విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్ వెల్ఫేర్ అసోసియషన్ ప్రెసిడెంట్ నరసింహులు అన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ.. ప్రతి గ్రామంలో వేలాది ఎకరాల భూమి సాగులో ఉందని, అలాంటిది రెండు మూడా సచివాలయాలకు ఒకరే గ్రామ వ్యవసాయ సహాకులను నియమిస్తే పనిభారంతో పాటు తీవ్రమైన ఒత్తిడికి గురయ్యే అవకాశం ఉంటుందని తెలిపారు.

ఉచిత శిక్షణ

డోన్ టౌన్ : దీన్ దయాల్ ఉపాధ్యాయ గ్రామీణ కౌసల్య యోజన పథకం కింద ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్, జూనియర్ సాఫ్ట్‌వేర్ వెబ్ డెవలపర్, బ్యూటీషియన్ తదితర కోర్సుల్లో కడపలో నాలుగు నెలల పాటు ఉచిత భోజన వసతి సదుపాయాలతో శిక్షణ అనంతరం సర్టిఫికెట్లతో పాటు ఉద్యోగవకాశాలు కల్పిస్తున్నట్లు నిహార్ స్కిల్ ఎడ్యుకేషన్ సంస్థ ప్రతినిధి హరిప్రసాద్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. 18- 35 సంవత్సరాల మధ్య వయస్సు వారు, 10వ తరగతి లేదా ఆపైన విద్యార్హత కలిగిన అనంతపురం, సత్యసాయి, కర్నూలు, నంద్యాల, చిత్తూరు, ప్రకాశం,అన్నమయ్య,తిరుపతి జిల్లాలకు చెందిన వారు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. శిక్షణ కాలంలో స్పోకెన్ ఇంగ్లిష్, కంప్యూటర్ పరిజ్ఞానం, లైఫ్ స్కిల్స్ కూడా నేర్పించబడునన్నారు. ఈ నెల 24 నుంచి బ్యాచ్ ప్రారంభమవుతుందని చెప్పారు. వివరాలకు సెల్ 9000487423 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

పెళ్లికి మధ్యవర్తిగా వ్యవహరించినందుకు దాడి

సంజామల: మధ్యవర్తిగా వ్యవహరించి పెళ్లి చేసిందుకు పేరుసోము గ్రామానికి చెందిన చంద్ర ఓబులేసు, భార్య విజయలక్ష్మిపై దాడి చేశారని ఎస్ఐ రమణయ్య బుధవారం కేసు నమోదు చేశారు. ఆయన తెలిపిన వివరాల మేరకు.. రామిరెడ్డిపల్లెకు చెందిన తలారి ప్రసాద్‌కు ఏడు సంవత్సరాల క్రితం అవుకు మండలం సింగనపల్లెకు చెందిన గురుదేవితో విజయలక్ష్మి మధ్యవర్తిగా ఉండి వివాహం చేసింది. అయితే తలారి ప్రసాద్, గురుదేవి మధ్య గొడవలు రావడంతో ఆరు నెలల నుంచి దూరంగా ఉంటున్నారు. ఈ నేపథ్యంలో మధ్యవర్తిగా వ్యవహరించి పెళ్లి చేసిన విజయలక్ష్మి, ఓబులేసుపై తలారి ప్రసాదుతో పాటు వారి కుటుంబ సభ్యులు ఐదుగురు దాడి చేసి గాయపరిచారు. చంద్ర ఓబులేసు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

పెయింట్ షాప్‌పై దాడులు

అవుకు: మండల కేంద్రంలోని ఓ పెయింట్ షాప్‌పై ఏషియన్ పెయింట్స్ కంపెనీ ప్రతినిధులు బుధవారం దాడులు చేశారు. రామక్రిష్ణ అనే వ్యక్తి పెయింట్ షాప్‌లో ఏషియన్ పెయింట్స్ కంపెనీ పేరుతో నకిలీ పెయింట్స్ అమ్ముతున్నాడని సమాచారం రావడంతో కంపెనీ వారు దాడులు చేశారు. ఈ దాడుల్లో 57 పెయింట్ డబ్బాలను గుర్తించి స్థానిక పోలీస్ స్టేషన్‌కు తరలించారు. పెయింట్ శాంపిల్స్‌ను సేకరించి విచారణ చేపడుతున్నట్లు ఎస్ఐ రాజారెడ్డి తెలిపారు.

ప్రమాదాలకు బ్రేకులు వేయండి



నాలుగురోడ్లు, పెట్రోల్‌బంకు కూడలిలో స్పీడ్ బ్రేకర్లు లేకుండా సువిశాలంగా ఉన్న సీసీ రోడ్డు

పట్టణంలోని వాహనాలు, జనరద్దీ ఎక్కువగా ఉన్న నాలుగురోడ్లు పెట్రోల్‌బంకు కూడలిలో స్పీడ్ బ్రేకర్లు లేకపోవడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. రోడ్డు సువిశాలంగా ఉండటంతో వాహనాలు వేగంగా వస్తుండటంతో ప్రమాదాలు సంభవిస్తున్నాయి. ప్రధానంగా ద్విచక్రవాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. యనకండ్ల వద్ద ఉన్న మహాసిమెంట్ ప్యాక్టరీ నుంచి భారీవాహనాలు సిమెంట్ లోడ్‌తో పెట్రోల్‌బంకు కూడలి నుంచే వెళ్తుంటాయి. ఈ ప్రాంతం నాలుగు రోడ్ల కూడలిగా ఉన్నందున బనగానపల్లె నుంచి అన్ని ప్రాంతాలకు ఆర్టీసీ వాహనాలతో పాటు ఇతర వాహనాలు కూడా ఎక్కువ సంఖ్యలో వెళ్తున్నాయి. ఇటీవల ఇక్కడ ఆర్టీసీ బస్సు, టిప్పర్ ఢీకొట్టుకోవడంతో బస్సు ముందు భాగం చాలావరకు దెబ్బతిన్న విషయం విధితమే. పెద్ద ప్రమాదాలు సంభవించకముందే సంబంధిత అధికారులు చర్యలు తీసుకొని స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని పట్టణవాసులు కోరుతున్నారు. ఈ విషయం పై ఆర్‌అండ్‌బీ డీఈఈ సునీల్‌కుమార్‌రెడ్డిని సంప్రదించగా.. స్పీడ్ బ్రేకర్ల ఏర్పాటుకు అవసరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

బనగానపల్లె

ముక్కు మూసుకోవాల్సిందే..!



హాస్టల్ ఎదురుగా వేసిన చెత్తకుప్పలు

మండల కేంద్రం సంజామలలో ఎక్కడ పడితే అక్కడ చెత్తకుప్పలు దర్శనమిస్తున్నాయి. అంతేకాకుండా కాల్వలలో మురుగు నీరు పేరుకుపోయింది. దీంతో స్థానికులు దుర్గంధంతో ముక్కు మూసుకొని నడవాల్సిన పరిస్థితి ఏర్పడింది. గ్రామంలో పారిశుధ్య పనులు అంతంత మాత్రంగానే జరుగుతున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. పంచాయతీ అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తునారనే విమర్శలు వినబడుతున్నాయి. ప్రధాన రహదారి దర్గ వద్ద మురుగు నీరు నిల్వ ఉండడంతో దోమలు బెడద తీవ్రంగా ఉందని కాలనీ వాసులు వాపోతున్నారు. ప్రధాన రహదారిలో ఉన్న హాస్టల్, ప్రాథమిక ఆరోగ్య కేంద్ర సమీపంలో చెత్తకుప్పలకు నిప్పుపెట్టడంతో పొగ, వాసనకు స్థానికులు సతమతం అవుతున్నారు. అధికారుల స్పందించి పారిశుద్య పనులు చేయించాలని కోరుతున్నారు.



సంజామల ప్రధాన రహదారిలో దర్గ వద్ద నిలిచి మురుగు నీరు

సంజామల

అంకిరెడ్డిపల్లెలో తాగునీటి ఎద్దడి

కొలిమిగుండ్ల: భూగర్భ జలాలు అడుగంటిపోవడంతో అంకిరెడ్డిపల్లెలో తాగునీటి సమస్య ఏర్పడింది. గ్రామంలో జనాభా తగ్గట్టుగా కుళాయిలకు నీరు సరఫరా కావడం లేదు. నీటి కోసం గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడుతుండటంతో గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో ట్యాంకర్ల సాయంతో నీటి సరఫరా చేస్తున్నారు. మార్చి నెలలోనే తీవ్రమైన నీటి ఎద్దడి ఏర్పడటంతో అష్టకష్టాలు పడుతున్నారు. వేసవి పూర్తయ్యే వరకు నీటి కోసం తిప్పలు తప్పవని ప్రజలు వాపోతున్నారు.



ట్యాంకర్ వద్ద నీళ్ల కోసం ఉంచిన బిందెలు

లైంగిక వేధింపులకు పాల్పడితే కఠిన చర్యలు



మాట్లాడుతున్న జడ్జి తంగమణి

ప్యాపిలి: బాలికలపై లైంగిక వేధింపులకు పాల్పడితే ఫోక్సో చట్టం కింద కఠిన శిక్షలు తప్పవని సీనియర్ సివిల్ జడ్జి తంగమణి అన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో స్టేట్, జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ ఆదేశాల మేరకు బుధవారం ఫోక్సో చట్టంపై అవగాహన కల్పించారు. ఎంపీడీఓ శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో జడ్జి మాట్లాడారు. బాలికలపై జరుగుతున్న లైంగిక వేధింపులను అడ్డుకోవాల్సిన అవసరం అందరిపై ఉందన్నారు. బాలికలను తల్లిదండ్రులు ఉన్నత చదువులు చదివించాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఇప్పటికీ బాలికల విద్యపై వివక్ష కొనసాగుతోందని, తల్లిదండ్రులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. ఎస్ఐ మధుసూదన్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ దేవకృపమ్మ పాల్గొన్నారు.

నివాళి

బేతంచెర్ల: మండలంలోని ఎంబాయి గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు మద్దిలేటి స్వామి ఆలయ మాజీ ధర్మకర్త, సొసైటీ మాజీ డైరక్టర్ బెలుం కృష్ణారెడ్డి అనారోగ్యంతో మృతి చెందారు. సమాచారం తెలుసుకున్న ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి, గిడ్డంగుల శాఖ మాజీ డైరక్టర్ బాబుల్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి రామచంద్రుడు, జిల్లా అధికార ప్రతినిధి మురళీకృష్ణ, పట్టణ కన్వీనర్ పిట్టల జాకీర్, ఎంపీటీసీ మునేశ్వర్‌రెడ్డి, మాజీ సింగిల్ విండో అధ్యక్షుడు రుద్రవరం నారాయణ, సర్పంచ్ యుగంధర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ ప్రసాద్ రెడ్డి బుధవారం మృత దేహంపై పూలమాల వేసి నివాళులర్పించారు.

వేధింపుల కేసు నమోదు

బేతంచెర్ల: మండలంలోని బలపాలపల్లె గ్రామానికి చెందిన సుస్మిత అనే మహిళను అదనపు కట్నం కోసం భర్త, అత్త, మామ, మేనమామలు వేధింపులకు గురి చేస్తున్నారని పోలీస్ స్టేషన్‌ను ఆశ్రయించింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు భర్త సుధాకర్, అత్త నాగేంద్రమ్మ, మామ సుంకన్న, మేనమామలు ఎల్లయ్య, మద్దయ్యపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ లింగమయ్య బుధవారం తెలిపారు.

రాయితీతో అదనపు లోడ్ క్రమబద్ధీకరణ

బేతంచెర్ల: విద్యుత్ గృహ వినియోగదారులకు ప్రభుత్వం 50 శాతం రాయితీతో అదనపు లోడ్ క్రమబద్ధీకరణ చేస్తుందని ఏడీ మధుసూదన్ రెడ్డి, టౌన్, రూరల్ ఏఈలు పుల్లయ్య, శ్రీనివాసులు బుధవారం తెలిపా రు. మీ సేవా కేంద్రం లేదా విద్యుత్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకొని రాయితీ పొందాలని సూచించారు.

	అసలు ధర (రూ.)	ఆఫర్ ధర
1కిలో వాట్	2,250	1,250
2కిలోవాట్	4,450	2,450
3కిలోవాట్	6,650	3,650
4కిలోవాట్	8,850	4,850
5కిలోవాట్	11,050	6,050

మొక్కలు నాటి సంరక్షించాలి



విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందజేస్తున్న దృశ్యం

బనగానపల్లె రూరల్ : ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని జేకేఆర్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు జెఎస్ఎస్ బ్రహ్మానంద ఆచారి అన్నారు. బుధవారం మండలంలోని పలుకూరు గ్రామంలోని డీపీయూపీ, ఉర్దూ పాఠశాలల్లో మొక్కల సంరక్షణ, విద్యార్థులు వేసవి కాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ చెట్లను పెంచడం వల్ల వాతావరణ కాలుష్య నియంత్రణతో పాటు వేసవి కాలంలో నీడను ఇస్తాయన్నారు. పాఠశాల స్థాయి నుంచే మొక్కల సంరక్షణ సామాజిక బాధ్యతగా భావించాలని సూచించారు. వేసవి కాలంలో విద్యార్థులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను పాఠశాల హెచ్‌ఎం రమాదేవి, ఉర్దూ పాఠశాల హెచ్‌ఎం రెహమాన్‌లు విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం చదువుల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులను అందజేశారు.

రక్తదానం చేసి ప్రాణ దాతలు కండి



వైద్య శిబిరంలో రక్తదానం చేస్తున్న యువకులు

కోవెలకుంట్ల: రక్తం అవసరమై ప్రాణాపాయ స్థితిలో ఉన్న వ్యక్తులకు సకాలంలో రక్తం అందించి ప్రాణ దాతలు కావాలని విక్కీ ఫౌండేషన్ అధ్యక్షుడు గోపిరెడ్డి ప్రతాప్‌రెడ్డి అన్నారు. తలసేమియా వ్యాధితో బాధపడుతున్న వారికి సకాలంలో అన్ని గ్రూపులకు సంబంధించిన రక్తం అందుబాటులో ఉండాలన్న ఉద్దేశంతో బుధవారం స్థానిక ఎస్ఎల్‌వీ సినిమా థియేటర్ ఆవరణలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. శిబిరంలో పట్టణానికి చెందిన 50 మంది యువకులు రక్తదానం చేశారు. నంద్యాల బ్లడ్ బ్యాంకు సిబ్బంది సహకారంతో వైద్య శిబిరం నిర్వహించారు.



మహిళా కుటుంబీకులకు రక్తాన్ని అందజేస్తున్న షబ్బీర్

డోన్: పట్టణంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో రక్తహీనతతో బాధపడుతున్న మహిళకు ద్రోణాచలం సేవాసమితి సభ్యులు క్యాంటీన్ షబ్బీర్ బుధవారం రక్తదానం చేశారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మహిళకు అత్యవసరంగా బి పాజిటివ్ రక్తం కావాలని వైద్యులు కోరగా, స్పందించిన షబ్బీర్..ఆసుపత్రికి వెళ్లి రక్తదానం చేశారు. ఈ సందర్భంగా రోగి కుటుంబ సభ్యులు రక్తదాతకు కృతజ్ఞతలు తెలిపారు.

అమ్మవారిని దర్శించుకున్న మాజీ ఎమ్మెల్యే



టంగుటూరు పెద్దమ్మ జాతరలో అమ్మవారిని దర్శించుకుంటున్న మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి

బనగానపల్లె : మండలంలోని టంగుటూరు గ్రామంలోని పెద్దమ్మ జాతరలో బుధవారం మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో అవుకు మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ కాటసాని తిరుపాల్‌రెడ్డితో పాటు గ్రామ సర్పంచ్ సూర్యనాగమద్దిలేటి, ఎంపీటీసీ మహానందిరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు పెద్దశివారెడ్డి, సురేష్ కుమార్ రెడ్డి, గాలిహనుమంతరెడ్డి తదితరులు పాల్గొన్నారు. గ్రామంలో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు గట్టిబందోబస్తు ఏర్పాటు చేశారు. పలువురు ప్రముఖులు పెద్దమ్మ జాతరలో పాల్గొన్నారు.

పరిరక్షణ వ్యవసాయ విధానంపై అవగాహన ఉండాలి



మాట్లాడుతున్న కేంద్రీయ మెట్ట పరిశోధన సంస్థ ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ జి. ప్రతిభ

బనగానపల్లె రూరల్ : రైతులు పరిరక్షణ వ్యవసాయ విధానంపై అవగాహన పెంచుకోవాలని హైదరాబాద్‌కు చెందిన కేంద్రీయ మెట్ట పరిశోధన సంస్థ ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ జి. ప్రతిభ అన్నారు. బుధవారం మండలంలోని యాగంటిపల్లె గ్రామ సమీపంలో ఉన్న కృషి విజ్ఞాన కేంద్రం(కేవీకే)లో కేవీకే ప్రధాన సీనియర్ శాస్త్రవేత్త ధనలక్ష్మి ఆధ్వర్యలో పరిరక్షణ వ్యవసాయ విధానాలపై రైతులు, శాస్త్రవేత్తల చర్చా కార్యక్రమం జరిగింది. ఇందులో పాల్గొన్న కేంద్రీయ మెట్ట పరిశోధన సంస్థ ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ జి ప్రతిభ మాట్లాడుతూ పరిరక్షణ వ్యవసాయం ద్వారా ప్రకృతి వనరులైన నేల, నీరు పరిమితిగా వాడడం వల్ల భావితరాలకు నాణ్యమైన వనరులు ఇవ్వడానికి దోహదపడుతుందని సూచించారు. ఈ విధానంలో నేల ఎక్కువగా దున్నకుండా, పంట వేయాలని సూచించారు. రైతులు ఎక్కువగా నేలను దున్నడం వల్ల సారవంతమైన పై పొరలు కొట్టుకుపోవడం, అలాగే కర్బన శాతం తగ్గుతుందని తెలిపారు. కార్యక్రమంలో కేంద్రీయ మెట్ట పరిశోధన సంస్థ శాస్త్రవేత్తలు డాక్టర్ జాగృతి, డాక్టర్ సువన, కేవీకే శాస్త్రవేత్తలు రమణయ్య, బాలరాజు, కృష్ణమూర్తి, ఆదినారాయణ పాల్గొన్నారు.

విండ్ పవర్ ఏర్పాటుకు సహకరించండి



మాట్లాడుతున్న ఆర్డీఓ నరసింహులు

బేతంచెర్ల: మండలంలో ఏకోరన్ సంస్థ ఆధ్వర్యంలో విండ్ పవర్ ఏర్పాటుకు ఆయా గ్రామాల రైతులు సహకరించాలని ఆర్డీఓ నరసింహులు తెలిపారు. బుధవారం పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ ప్రకాశ్ బాబు, ఏకోరన్ అధికార ప్రతినిధి టి.వెంకటకృష్ణారావు ఆధ్వర్యంలో ఆర్ఎస్ రంగాపురం, హెచ్ కొట్టాల గ్రామ రైతులతో సమావేశం నిర్వహించారు. ఆర్డీఓ మాట్లాడుతూ బేతంచెర్ల, ఆర్ఎస్ రంగాపురం, గూటుపల్లె, ఎం.పేండేకల్లు, కొలుములపల్లె, ముద్దవరం గ్రామాల పరిధిలోని 51 గాలి మరలు (విండ్ పవర్) ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. విండ్ పవర్ ఏర్పాటుకు సంబంధించి రైతుల భూములు ఎకరాకు ఏడాదికి ప్రభుత్వ నిబంధనల మేరకు రూ.31వేల లీజు చెల్లిస్తారని చెప్పారు. రైతులతె సంస్థ ప్రతినిధులు 30 సంవత్సరాల పాటు లీజుకు తీసుకుంటారని చెప్పారు. ప్రతి రెండు సంవత్సరాలకొకసారి 5 శాతం అదనంగా లీజు చెల్లిస్తారని తెలిపారు. రైతులు, వీఆర్వోలు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆధార్ క్యాంపులు

కొలిమిగుండ్ల: అంగన్‌వాడీ కేంద్రాల్లో బుధవారం నుంచి ఆధార్ క్యాంపులు ఏర్పాటు చేశారు. మొదటి రోజు చింతలాయిపల్లె ఎస్సీ కాలనీలోని అంగన్‌వాడీ కేంద్రం, మదనంతపురం, అబ్దులాపురం, ఉమ్మాయిపల్లె గ్రామాల్లో శిబిరాలు ఏర్పాటు చేసి చిన్నారులకు ఆధార్ కో-ఆర్డినేటర్ మహేంద్ర వివరాలు నమోదు చేశారు. మొత్తం 25 మంది చిన్నారులకు ఆధార్ నమోదు చేసినట్లు తెలిపారు.

కేబినెట్ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలి

కోవెలకుంట్ల: ఎస్సీ వర్గీకరణ అంశంపై కేబినెట్ తీసుకున్న నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని మాల మహానాడు రాయలసీమ అధ్యక్షుడు కోగిల ప్రసాద్ డిమాండ్ చేశారు. బుధవారం పట్టణంలోని జమ్మలమడుగు కూడలిలో రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద మాల జేఏసీ సంఘాల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎస్సీ వర్గీకరణ చేపట్టకుండా మాల మాదిగలు కలిసిమెలసి ఉండేగా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో మాలమహానాడు జిల్లా మహిళా అధ్యక్షురాలు కోగిల రంగమ్మ, సుదర్శనం, సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి అంగన్‌వాడీలకు శిక్షణ

కోవెలకుంట్ల: పట్టణంలోని ఉర్దూ ఉన్నత పాఠశాలలో గురువారం నుంచి మండలంలోని అంగన్‌వాడీ కార్యకర్తలకు శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు ఐసీడీఎస్ సూపర్‌వైజర్ చంద్రమ్మ తెలిపారు. బుధవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ «పోషణ్ భీ పడాయి» అనే కార్యక్రమంపై మూడు రోజులపాటు అంగన్‌వాడీ కార్యకర్తలకు శిక్షణ ఉంటుందన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో పూర్వ ప్రాథమిక విద్యనభ్యసించే సున్న నుంచి ఆరు సంవత్సరాల్లోపు చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు ఇవ్వాల్సిన పోషకాహారం, ఆరోగ్య సూత్రాలను తెలియజేస్తారన్నారు. అంగన్‌వాడీ కార్యకర్తలు శిక్షణకు విధిగా హాజరు కావాలని సూచించారు.

పది పరీక్ష కేంద్రాల తనిఖీ

ప్యాపిలి: స్థానిక బాలుర, బాలికల ఉన్నత పాఠశాలల్లో ఏర్పాటు చేసిన పదో తరగతి పరీక్ష కేంద్రాలను తహసీల్దార్ భారతి బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కేంద్రంలో సౌకర్యాల గురించి ఆమె ఆరా తీశారు. విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా పరీక్షలను సజావుగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. ఎండల తీవ్రత ఎక్కువగా ఉన్నందున వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. అవసరమైన విద్యార్థులకు ఓఆర్ఎస్ ఇవ్వాలని సూచించారు.

అర్జీలను పరిష్కరించలేదు

బేతంచెర్ల: ఈ ఏడాది జనవరి నెల 27న శ్మశాన వాటిక సర్వే చేసి సమస్యను పరిష్కరించాలని స్పందనలో ఇచ్చిన దరఖాస్తును ఇప్పటి వరకు పరిష్కరించలేదని రాష్ట్ర క్రిస్టియన్ సెల్ కార్యదర్శి మేకల నాగరాజు, జిల్లా అధికార ప్రతినిధి రూబెన్ ఆర్డీఓ నరసింహులుకు బుధవారం విన్నవించారు. సమస్యను పరిష్కరించాలని ఆర్డీఓ..తహసీల్దార్ ప్రకాశ్ బాబు, రెవెన్యూ సిబ్బందిని ఆదేశించారు.

స్పోర్ట్స్ కిట్స్ అందజేత

డోన్ టౌన్ : మారెళ్ళ రాజశేఖర్‌రెడ్డి సహకారంతో వివేకానంద సేవా సమితి సభ్యులు విద్యార్థులకు రూ.4వేల విలువజేసే స్పోర్ట్స్ కిట్స్‌ను అందజేశారు. విద్యార్థులకు చదువుతో పాటు క్రీడల ప్రాధాన్యతను గుర్తించి బుధవారం పట్టణ సమీపంలోని అంబేడ్కర్ బాలుర గురుకుల పాఠశాల,మోడల్ స్కూల్‌ను సందర్శించి ప్రిన్స్‌పాళ్లు వేణుగోపాల్,శ్రీనివాస్‌ను కలిసి కిట్ అందజేశారు. సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు జగన్‌మోహన్, అధ్యక్షుడు నాగభూషణంరెడ్డి పాల్గొన్నారు.

నకిలీ పక్షవాత నివారణ కేంద్రంపై దాడులు



పక్షవాత నివారణ కేంద్రం వద్ద అధికారులు

బనగానపల్లె రూరల్ : పట్టణంలోని రవ్వలకొండపై అనధికారికంగా వెలసిన పక్షవాత నివారణ వైద్య కేంద్రం పై ఆయుష్ శాఖ జిల్లా డ్రగ్ ఇన్‌స్పెక్టర్ డాక్టర్ రవికుమార్, బనగానపల్లె ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాల చీఫ్‌మెడికల్ ఆఫీసర్ డాక్టర్ టి.వాణి బుధవారం దాడులు నిర్వహించారు. జిల్లా డ్రగ్ ఇన్‌స్పెక్టర్ మాట్లాడుతూ వి.వి. సూర్యనాయుడు అనే నకిలీ వైద్యుడు ఎలాంటి అర్హతలేకున్నా చాల సంవత్సరాల నుంచి బనగానపల్లెలో పక్షవాతం వైద్యం చేస్తూ, ప్రజల ఆరోగ్యానికి హాని కలిగిస్తున్నాడన్నారు. ప్రజల నుంచి ఫిర్యాదులు రావడంతో ఈ దాడులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దాడి విషయం ముందు గానే తెలుసుకున్న నకిలివైద్యుడు సూర్య నారాయణ పరారయ్యాడు. అతని పై స్థానిక పోలీసు స్టేషన్‌లో కూడా ఫిర్యాదు చేసినట్లు ఆయుర్వేద వైద్యశాల చీఫ్‌మెడికల్ ఆఫీసర్ డాక్టర్ వాణి తెలిపారు. దాడుల్లో ఆయుర్వేద వైద్యశాల సిబ్బంది షకీల్ ఆహమ్మద్, ఉస్మాన్‌బాషా పోలీసు సిబ్బంది ఉన్నారు.

రేపు పంచాయతీ వేలాలు

బేతంచెర్ల: మండలంలోని సిమెంట్ నగర్ మేజర్ గ్రామ పంచాయతీలో 2025-26 ఆర్థిక సంవత్సరానికి బండ్లమెట్ట, దిన మార్కెట్, వారపు సంత, చిన్న కమేళా బహిరంగ వేలం ఈనెల 21వ తేదీన నిర్వహిస్తున్నట్లు ఈఓ వెంకటేశ్వర్లు తెలిపారు. వేలంలో పాల్గొనే వారు గ్రామ పంచాయతీ నిర్ణయించిన దరావత్తు వరుసగారూ.3,15,000, రూ.20 వేలు, రూ.15 వేలు, రూ.వెయ్యి డిపాజిట్ చెల్లించి పాల్గొనాలన్నారు.